క్లుప్తంగా

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం అందజేత



రత్తయ్యకు ఆర్థిక సహాయం అందజేస్తున్న జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు

యలమంచిలి: అడవిపాలెం గ్రామానికి చెందిన మెట్టపల్లి రత్తయ్యకు ఇటీవల గుండె శస్త్ర చికిత్స జరిగింది. దీంతో ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతని ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం అతని మందుల ఖర్చుల నిమిత్తం తమ వంతు సహాయంగా రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గెద్దం సునీల్ గవాస్కర్, గౌరవ అధ్యక్షుడు భవానీ ప్రసాద్ రాయపూడి, వలవల విష్ణు బాలాజీ, నారిమెరక సొసైటీ రిటైర్డ్ ఉద్యోగి వడ్డి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఐకమత్యంతో మెలగాలి



ఆరేటి ఆర్యన్‌ను సత్కరిస్తున్న కృష్ణవర్మ

పాలకొల్లు సెంట్రల్: మన దేశాన్ని బ్రిటీష్ తెల్లదొరలు పాలించారంటే ఇక్కడ మనలో మనం కొట్టుకుని బ్రిటిష్ వాళ్లను సహాయం కోరడంతో మనం దేశాన్ని కోల్పోవాల్సి వచ్చిందని లండన్ డిప్యూటి మేయర్ ఆరేటి ఆర్యన్ అన్నారు. శుక్రవారం పాలకొల్లు లజపతిరాయ్‌పేట మాంటిస్సోరి పాఠశాలకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్యన్ మాట్లాడుతూ లండన్‌లో తనకు డిప్యూటీ మేయర్ రావడానికి కూడా కారణం అక్కడ ఐకమత్యం లోపం వల్లే తనకు ఈపదవి దక్కిందని అన్నారు. అనంతరం ఆర్యన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ కేవీ కృష్ణవర్మ, కోడి విజయభాస్కర్, చిలుకూరి కుమార్, అంగర రామ్మోహన్, మేకా శేషుబాబు, నిమ్మల పాపారావునాయుడు పాల్గొన్నారు.

స్టాక్ యార్డులో 13 వేల టన్నుల ఇసుక

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నియోజకవర్గం పరిధిలో ఉన్న పాలకొల్లు పట్టణం, మండలం, యలమంచిలి, పోడూరు మండలాల ప్రజలకు 13 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉంచినట్లు పాలకొల్లు తహసీల్దార్ వై దుర్గా కిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొల్లు మండలం పెదమామిడిపల్లి బైపాస్ రోడ్‌లో షిరిడి సాయి మోడరన్ రైస్ మిల్ ఎదురుగా సాండ్ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. వరదల కారణంగా అందుబాటులో ఉన్న ర్యాంప్స్ మూసివేసినట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రజలంతా తమ నిర్మాణ పనులకు ఇబ్బంది కలగకుండా ఈ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): మెప్మా సిబ్బందికి, మెప్మా ఆర్పీలకు పీఎం సూర్యఘర్ పథకంపై శుక్రవారం భీమవరంలో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీఎం సూర్యఘర్ పథకంలో ఏవిధంగా నమోదు చేయాలో, సబ్సిడీ, బ్యాంకు లోన్ గురించిన విషయాలు ఆ పథకం వల్ల కలిగే లాభాలు గురించి ఎల్విన్ సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా మెప్మా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.హెప్సిబా మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం గురించి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఎక్స్‌పర్ట్ సీ.హెచ్. నానీబాబు, ఐబీ సిహెచ్.మోహనరావు పాల్గొన్నారు.

వృద్ధుల చట్టంపై అవగాహన

ఆకివీడు: వృద్ధుల చట్టాన్ని ప్రతి ఒక్క వృద్ధుడూ తెలుసుకుని తనను తాను రక్షించుకోవాలని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్ గేదల అప్పారావు పిలుపునిచ్చారు. సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు అట్లూరి రంగారావు నివాసం వద్ద శుక్రవారం వృద్ధుల చట్టంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులను అనాథాశ్రమాల్లో వదిలివేయడం, రోడ్లపైన, ఇతర ప్రదేశాల్లో వదిలివెళ్లేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వృద్ధులను చూసుకోవలసిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. సంఘ అధ్యక్షులు బంగారయ్య మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా వృద్ధుల సంఘం దాతల సహకారంతో పలు సేవా కార్యక్రమాల్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో రంగారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గుండా సుందరరామనాయుడు, వీజే కోటేశ్వరరావు బాబు, మన్నే పోతరాజు, మోరా జ్యోతి, యర్రా కేశవరావు, కౌనిసలర్ గోపిశెట్టి సత్యవతి, సత్యనారాయణ, సంఘ ఉపాధ్యక్షుడు నేరెళ్ల ఆదినారాయణ, ఎస్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ రహదారిపై ప్రయాణం భయం భయం

- నిత్యం ఏదో ప్రమాదం
- హడలిపోతున్న వాహనదారులు



బోల్తా పడ్డ పాలవ్యాన్



వదలి పిట్టల వేమవరం రహదారిలో మార్జిన్ దుస్థితి

పెనుగొండ: వడలి–పిట్టల వేమవరం రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. తూర్పుగోదావరి జిల్లా మొగలో రహదారి విస్తరణ జరిగినా, పశ్చిమగోదావరి జిల్లా శివారున కేవలం సింగిల్ రోడ్డు మాత్రమే ఉండడంతో నిత్యం ప్రమాదాలతో వాహనదారులు క్షతగాత్రులు అవుతున్నారు. పిట్టల వేమవరం, అన్నవరప్పాడుల మీదుగా జాతీయ రహదారికి దగ్గర మార్గం కావడం, రహదారి గోతులు లేకుండా ఉండడంతో జాతీయ రహదారికి చేరుకోవడానికి పెనుగొండ పరిసర ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది ప్రయాణం చేస్తున్నారు. సిద్ధాంతం వద్ద జాతీయ రహదారిలో కలిసే అవకాశం ఉన్నా, రహదారి పూర్తిగా గోతులమయంగా మారడంతో వడలి–పిట్టల వేమవరం రహదారినే వాహనదారులు వినియోగిస్తున్నారు. అయితే 70 రూపాయల వంతెనగా పేరు గాంచిన తూర్పుగోదావరి జిల్లా మొగలోని కల్వర్టు వరకూ మాత్రమే రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినా తప్పించుకోవడానికి విస్తరించిన రహదారి ఉపయోగ పడుతుంది. కానీ, వడలి నుంచి 70 రూపాయల వంతెన వరకూ కేవలం సింగిల్ రోడ్డు ఉండడం, రోడ్డు మార్జిన్‌లు పూర్తిగా గోతులమయంగా మారడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతుంది.

వర్షాలతో మరింత అధ్వానం

ఇటీవల కురిసిన వర్షాలతో మరీ దారుణంగా మారింది. ఇప్పటికే ఇటీవల కాలంలో మోటారు సైకిల్ పక్కనుంచి వెళ్లినా అదుపుతప్పి ప్రాణాలు పోగొట్టు సంఘటనలు ఉన్నాయి. ఇలాగే పెనుగొండకు చెందిన ఓ యువకుడు ప్రాణాలు పోగొట్టుకున్నాడు. అదేవిధంగా వడలికి చెందిన వారు మృత్యువాత పడ్డారు. వరుస ముసుర్లుతో మార్జిన్లు మొత్తం వర్షపు నీటితో నిండిపోవడంతో గోతులు అంచనా తెలియక వాహనాలు బోల్తా పడుతున్నాయి. రెండు రోజుల వ్యవధిలోనే పాల వ్యాను, మినీలారీలు గోతుల్లో పడి పంట కాలువల్లోకి, పక్కనే ఉన్న చేలల్లోకి బోల్తా పడ్డాయి. దీంతో వాహనదారులు హడలిపోతున్నారు. అధికారులు పట్టించుకుని రూ.70 వంతెన నుంచి వడలి వరకూ రహదారి విస్తరణ చేపట్టాలని కోరుతున్నారు. అంతవరకు కనీసం మార్జిన్లు పటిష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మార్జిన్లు పటిష్ఠ పరచడం వల్ల కనీసం ప్రమాదాలు తగ్గుతాయని, అధికారులు తక్షణం స్పందించాలని కోరుతున్నారు.

ఉద్యోగ మేళాలో 62 మంది ఎంపిక



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా ఘనంగా నిర్వహించారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్మెంట్ సెల్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అండ్ నేషనల్ కెరీర్ సర్వీస్ ఉద్యోగ దిక్సూచి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో నిరుద్యోగులు 150 మంది హాజరయ్యారు. వీరిలో 62 మంది ఉద్యోగాలు పొందారని ప్రిన్సిపల్ రాజేశ్వరి తెలిపారు. వీరిలో ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాల విద్యార్థులు 24 మంది, ఇతర కాలేజీ విద్యార్థులు 38 మంది ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి కృష్ణ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ కె భద్రాచలం, అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వి.యామిని తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనాల సందడి షురూ



నరసాపురం: వనువులమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన భారీ గణపయ్య విగ్రహం



పెనుమంట్ర: పెద్ద చెరువు గట్టు గణపతికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: వినాయకచవితి రావరాత్రి ఉత్సవాలు పట్టణంలో ఘనంగా జరుగుతున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో భారీగా వినాయక మండపాలు ఏర్పాటు చేసి చవితి పూజలు చేస్తున్నారు. ఉత్సవాలు ప్రారంభమై మూడవరోజుకు చేరడంతో శుక్రవారం అన్ని మండపాల వద్ద పెద్ద ఎత్తున పూజలు చేశారు. పండ్ల మార్కెట్‌సెంటర్, పంజాసెంటర్, రాయిపేట మూడుబొమ్మల సెంటర్, చినమామిడిపల్లి, శనివారపుపేట, పీచుపాలెం, వనువులమ్మగుడి, పొన్నపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసి భారీ గణపతి విగ్రహాలను పెద్దసంఖ్యలో భక్తులు తిలకించి పూజలు చేశారు..

యలమంచిలిలో.

యలమంచిలి: వినాయక చవితి వేడుకలు గ్రామాలలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. ప్రధాన సెంటర్లలో ఏర్పాటుచేసిన మండపాల వద్ద భక్తులు ఉదయం, సాయంత్రం పూజలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. యలమంచిలి మార్కెట్ సెంటర్లో ఏర్పాటుచేసిన విగ్రహం వద్ద శుక్రవారం మాజీ ఎంపీపీ రావూరి వెంకటరమణ, బుజ్జి కుటుంబ సభ్యులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. పూజానంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

పెనుగొండలో..

పెనుగొండ: గణపతి నవరాత్రులు పెనుగొండ, ఆచంట మండలాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడో రోజు శుక్రవారం ఉదయం నుంచి గణపతికి అభిషేకాలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెనుగొండ వేంద్ర వారి వీధి, గుబ్బల వారి వీధి, లింగాల వీధి, శివాలయం వీధి, సుబ్రహ్మణ్యం స్వామి ఆలయం వద్ద, బాపూజీపురం, జవ్వాదివారి వీధి, కంబాల వారి వీధి, గాంధీ బొమ్మల సెంటర్, బజారు రామాలయాల వద్ద చలువ పందిళ్లలో పూజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నార. మార్టేరులోని విద్యా గణపతిఆలయం వద్ద, వెలగలేరులోని సిద్ధి వినాయక ఆలయం, రామేశ్వరాలయం ఆవరణలో ప్రతిష్ఠించిన ప్రతిమల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పెనుమంట్రలోని రెడ్డి రామాలయం యూత్, పల్లపు వీధి యూత్, పెద్ద చెరువు గట్టు శెట్టిబలిజ యూత్, శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం వద్ద తుంపూడి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పెనుమంట్ర పెద్ద చెరువుగట్టు శెట్టి బలిజ యూత్ ఆధ్వర్యంలో గణపతిని ప్రత్యేక రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం ఐదో రోజు సందర్భంగా నిమజ్జనాలు పెద్ద ఎత్తున ఉండే అవకాశం ఉంది.



పెనుగొండ: గ్రామంలో గణపతి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



యలమంచిలి: వినాయకుని మండపంలో పూజలు చేస్తున్న భక్తులు

గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి మంచి ఆదరణ



కొప్పర్రులో నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

నరసాపురం రూరల్: వైఎస్సార్‌సీపీకి గ్రామాల్లో మంచి ఆదరణ ఉందని, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని పార్టీ శ్రేణులకు వైఎస్సార్ సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పీడీ రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని కొప్పర్రు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఎన్నిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకిత బావంతో పనిచేసే వారికి పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కొప్పర్రు గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొప్పర్రు గ్రామ శాఖ అధ్యక్షుడిగా రావి బ్రహ్మాజీ, ప్రధాన కార్యదర్శులుగా మానుకొండ సామ్యూల్, పుచ్చకాయల సంతోష్‌కుమార్, చెల్లబోయిన పాండురంగ, పాకా వెంకటేశ్వరరావు, ఇంజేటి నాగేశ్వరరావు, కార్యదర్శులుగా చింతపల్లి నరసింహారావు, వడి జయరాజు, పల్లపాటి సూర్యారావు, కార్యవర్గ సభ్యులుగా వలవల శ్రీఏసుబాబు, పోలిశెట్టి సూర్యనారాయణ, తామరాడ పార్వతీశం, మడికి జోసఫ్, ఉప్పు రమేష్, పీతల సంషోను, ఇంజేటి నరసింహారావు, మల్లుల సత్యనారాయణ తదితరులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. వీరితో పాటు యూత్ గ్రామ అధ్యక్షుడిగా కప్పల వికాస్ బాబు, రైతు విభాగం గ్రామ అధ్యక్షుడిగా ముక్కు వీరవెంకట సత్యనారాయణ, ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షుడిగా నల్లి జేమ్స్, బీసీ సెల్ గ్రామ అధ్యక్షుడిగా పాకా భద్రం, మహిళా గ్రామ అధ్యక్షురాలిగా బద్దా శాంతకుమారి, మేధావుల ఫోరం అధ్యక్షుడిగా బద్దా రామోహన్‌రావులను ఎన్నుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



వల్లూరు ఎంపీ పాలెంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రతిభను ప్రోత్సహించడమే బాల్యమిత్ర సేవా ట్రస్ట్ లక్ష్యమని సంస్థ అధ్యక్షుడు గుబ్బల రామకృష్ణ అన్నారు. శుక్రవారం వల్లూరు ఎంపీపాలెం జడ్పీపాఠశాలలో పూర్వ విద్యార్థులతో ఏర్పడిన బాల్యమిత్ర సేవా ట్రస్ట్ 1989 ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన ప్రతి తరగతిలోని ముగ్గురు విద్యార్థులను, ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉత్తమ గురువులు వల్లూరు ప్రధానోపాధ్యాయుడు ఆకన రామకృష్ణ, గణిత ఉపాధ్యాయయులు టీఎస్ శ్రీనివాసరావు, ఆంగ్ల ఉపాధ్యాయుడు గుడాల రామ వెంట సుబ్బారావులను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ అధ్యక్షుడు జె.జాన్సకుమార్, ట్రస్ట్ కోశాధికారి ఎస్.మన్మథరావు, ట్రస్ట్ సభ్యుడు ఎం.రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



నరసాపురం రూరల్: కొప్పర్రు ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



పెనుమంట్ర: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

పాలకొల్లు సెంట్రల్: తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం పాలకొల్లులో ఘనంగా నిర్వహించారు. స్థానిక చాంబర్స్ కళాశాలలో ప్రముఖ సహస్రావధాని గుడిమెళ్ల వరప్రసాద్ విద్యార్థులకు తెలుగు భాష గొప్పదనం గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీ నరసింహారావు, కార్యదర్శి కేవీ సీతారామరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, అకడమిక్ అడ్వైజర్స్ డాక్టర్ ఏబీఎస్ మూర్తి పాల్గొన్నారు. అలాగే స్థానిక బ్రాడీపేటలో ఉన్న అల్లు వెంకట సత్యనారాయణ పురపాలక ఉన్నత పాఠశాలలో రసధుని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. సంస్కృతోపాధ్యాయిని అంగర నాగలక్ష్మీ మానసను సత్కరించారు. కార్యక్రమంలో కొట్టి భాస్కరరావు, యర్రంశెట్టి వెంకట రత్నం, హెచ్ఎం చామకూరి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్ కళాశాలలో

స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా పట్టణ స్థాయిలో చదరంగం పోటీలు నిర్వహించారు. పాలకొల్లు జేసీఏ సెక్రటరీ డాక్టర్ మౌనిక ఈ పోటీలను ప్రారంభిస్తూ చదరంగం ఆడుతుంటే మెదడు పనితీరు మెరుగుపడుతుందన్నారు. పాలకొల్లు వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ త్సటవర్తి సుధాకర్ పోటీల్లో విజేతలకు వాకర్స్ క్లబ్ తరఫున బహుమతులు అందజేశారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రమేష్, తెలుగు అధ్యాపకులు జాన్‌రాజ్ పాల్గొన్నారు. అలాగే శివదేవుని చిక్కాల గ్రామంలోని కేవీ ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు, సంస్కృత భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం పి.రాము, సుబ్రహ్మణ్య శాస్త్రి, రామన్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నరసాపురంలో...

నరసాపురం రూరల్: ఇంగ్లీషు భాష మోజుతో తెలుగు భాషను విస్మరించరాదని, తెలుగుపై పట్టు సాధిస్తేనే ఇతర భాషల్లో రాణించగలమని ప్రధానోపాధ్యాయురాలు ఉప్పుగంటి రాజశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం నరసాపురం మండలంలోని కొప్పర్రు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: జాతీయ క్రీడల్లో భారతదేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చి పెట్టిన హాకీ క్రీడాకారుడు ధ్యానచంద్‌ను, తెలుగు భాషను సామాన్యులకు అర్థమయ్యే రీతిలో తీర్చిదిద్దిన గిడుగు రామ్మూర్తి పంతులును నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పెనుమంట్ర రామయ్య అచ్చితానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం లింగం శారద అన్నారు. శుక్రవారం జాతీయ క్రీడా, తెలుగు భాష దినోత్సవాలను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడ, తెలుగు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం డి .శ్రీనివాస్, తెలుగు పండిట్ కె. వెంకటలక్ష్మి, ఐ.సత్యవాణి, ఎం .ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి పురస్కరించుకుని శుక్రవారం మాతృభాషా దినోత్సవం పెనుగొండలో పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష గొప్పతనాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



పాలకొల్లు సెంట్రల్: చాంబర్స్ కళాశాలలో ప్రముఖ సహస్రావధాని గుడిమెళ్ల వరప్రసాద్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం



పెనుగొండ: కవులు, కవయిత్రుల వేషధారణలో చిన్నారులు

నేడు సంచార జాతుల స్వాతంత్య్ర దినోత్సవం

నరసాపురం రూరల్: సంచార జాతుల స్వాతంత్య్ర దినోత్సవాన్ని శనివారం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు పెండ్ర వీరన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భీమవరంలోని వీరమ్మ పార్కు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కార్యాలయంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు సంబంధించి 73వ స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నటు స్పష్టం చేశారు. 1952 ఆగష్టు 31న భారతదేశ వ్యాప్తంగా నేరస్తులుగా ఉన్న సంచార జాతుల వారిని విముక్త జాతులుగా గుర్తిస్తూ చట్టం తీసుకువచ్చారని గుర్తు చేశారు. కాబట్టి సంచార జాతుల సంఘం ఆధ్వర్యంలో గత 9 సంవత్సరాలుగా సంచారజాతుల స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వీరన్న పేర్కొన్నారు.

పుంత రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

పెనుగొండ: పెనుగొండ ఏఎంసీ పరిధిలో పుంత రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేసినట్లు ఏఎంసీ చైర్మన్ బడేటి వీరబ్రహ్మం(బ్రహ్మాజీ) తెలిపారు. శుక్రవారం పెనుగొండ ఏఎంసీ మొదటి సమావేశం నిర్వహించి తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రామారావు, సూపర్‌వైజర్ డి.నరసింహరావు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

యలమంచిలి: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఒక వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.గుర్రయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కనకాయలంక కాజ్‌వే వద్ద వరద విధులను నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుల్స్ వద్దకు కొంబత్తుల బాలకృష్ణ అనే వచ్చి తాగి వచ్చి దుర్భాషలాడాడని పేర్కొన్నారు. దీంతో ఆ కానిస్టేబుల్స్ ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.